క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులకు అభినందన

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన వత్సవాయి గ్రామానికి చెందిన గాదెల రామారావు, కార్యదర్శిగా నియమితులైన జగ్గయ్యపేట పట్టణం, విలియంపేటకు చెందిన చెరుకుమల్లి రాంబాబును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అభినందించారు. ఉదయభానును ఆయన నివాసంలో గాదెల రామారావు, చెరుకుమల్లి రాంబాబు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. తమను ఈ పదవుల్లో నియమించినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, అందుకు కృషిచేసిన ఎమ్మెల్యే ఉదయభానుకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ఇందుగపల్లి(వత్సవాయి): కొండ ముచ్చుల దాడిలో ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన పెద్దపోగు సామేలు మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను బుధవారం పరామర్శించారు. గ్రామంలో విచ్చలవిడిగా తిరుగుతున్న కొండముచ్చులను వలల ద్వారా పట్టుకుని దూరంగా అటవీప్రాంతంలో వదిలిపెడతామన్నారు. ప్రభుత్వ నుంచి ఆర్థికసాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.

ఉపాధ్యాయులకు అంకితభావం అవసరం

వీరులపాడు: ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తే మంచి ఫలితాలు సాధించొచ్చని ఎంఈఓ ఆదూరి వెంకటరత్నం పేర్కొన్నారు. మండలంలోని జుజ్జూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ రీతిలో విద్యా బోధన చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ మెను ప్రకారం మధ్యాహ్న భోజన పథకం అమలయ్యేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఉన్నత పాఠశాలకు సైన్స్ పరికరాల అందజేత

శనగపాడు (పెనుగంచిప్రోలు): గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం సైన్స్ పరికరాలను విరాళంగా ఇచ్చారు. చోడగిరి కిషోర్ మైక్రోస్కోప్, పలు రసాయనాలు, ఇతర పరికరాలను హెచ్ఎం పాల్ రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు విద్యార్థులు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ చైర్మన్ విజయరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

నందిగామ: పట్టణంలోని కాకతీయ అపోలో పాఠశాలలో బుధవారం విద్యార్థులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా వన్ చైల్డ్, వన్ ప్లాంట్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలలోని ప్రతి విద్యార్థీ మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణ బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల ఆవరణలో మొత్తం 500 మొక్కలు నాటామని పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు కాపా రవీంద్రనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల పద్యగళార్చన

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలుగు భాషా వారోత్సవాల్లో భాగంగా స్థానిక జోజి నగర్‌లోని శ్రీదుర్గా మల్లేశ్వర యండూరి రామలింగేశ్వరరావు (ఎస్‌డీఎంవైఆర్ఆర్) హైస్కూల్లో బుధవారం నిర్వహించిన వేడుకల్లో తెలుగుదనం, తెలుగు భాష ఔన్నత్యం వెల్లివిరిసింది. ముఖ్యంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సామూహిక పద్య గళార్చన విశేషంగా ఆకట్టుకుంది. నన్నయ, తిక్కన రచించిన మహాభారతంలోని పద్యాలను చక్కగా పఠించారు. అదే విధంగా శాకుంతలం, భువన విజయం నాటకాలను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. మొల్ల, నన్నయ, అల్లూరి సీతారామరాజు, తెలుగు తల్లి ఏకపాత్రాభినయాలను చక్కని హావభావాలతో అభినయించారు. తెలుగులో ఇటీవల డాక్టరేట్ పట్టా సాధించిన పాఠశాల పూర్వ విద్యార్థిని కూచిబొట్ల వరలక్ష్మిని పాఠశాల యాజమాన్యం సత్కరించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో హైస్కూల్ కమిటీ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, ఉపాధ్యక్షులు తూనుగుంట్ల శ్రీనివాసులు, సెక్రటరీ/కరస్పాండెంట్ యండూరి శివకృష్ణ కిషోర్ పాల్గొని గరిణె చారిటబుల్ ట్రస్ట్ అధినేత మాజేటి సతీష్ స్పాన్సర్ చేసిన లాంగ్ నోట్‌బుక్స్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలుగు భాషకు పట్టంగట్టిన మహనీయుడు గిడుగు వేంకట రామ్మూర్తి అన్నారు. గ్రాంధిక భాషలో ఉండే తెలుగును వ్యావహారిక భాషగా అందుబాటులోకి తీసుకువచ్చిన వారిలో అగ్రగణ్యుడు గిడుగు అన్నారు. ప్రధానోపాధ్యాయుడు మొగుళ్లూరి కృష్ణకుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విభిన్న ప్రతిభావంతులకు అండగా ప్రభుత్వం



నందిగామలో మోటారు వాహనాలతో దివ్యాంగులు (ఫైల్)



మోటారు వాహనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు (ఫైల్)

- లబ్ధిదారులకు ఉచితంగా మోటారు వాహనాల పంపిణీ
- ప్రతి నియోజకవర్గంలోనూ పంపిణీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

నందిగామ: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలను అందిస్తోంది. విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించేందుకు ఎన్నో కార్యక్రమాలు చేపడుతోంది. ముఖ్యంగా అవయవ లోపం గల వారికి మూడు చక్రాల మోటారు సైకిళ్లను అందజేస్తోంది. అన్ని నియోజకవర్గాల్లోనూ అర్హులను గుర్తించి ఉచితంగా ఈ వాహనాలను పంపిణీ చేస్తోంది. ఎవరిపైనా ఆధార పడకుండా తమ దైనందిన కార్యక్రమాలను సొంతంగా చేసుకునేలా చర్యలు చేపట్టింది.

1,750 వాహనాలు అందజేత

రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతులు ఎంతో మంది ఉన్నారు. వారిలో అవయవ లోపంతో కాళ్లు పని చేయని అర్హులైన విద్యార్థులు, నిరుద్యోగులు, పదో తరగతికి పైగా చదువుకొని చిరు వ్యాపారాలు చేసుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం మోటారు వాహనాలను పంపిణీచేస్తోంది. ఒక్కొక్కరికి రూ.1.20 లక్షల విలువచేసే మోటారు వాహనాన్ని ఉచితంగా అందజేస్తోంది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో నియోజకవర్గానికి పది వాహనాల చొప్పున ఇప్పటికే పంపిణీచేసింది. అర్హత కలిగిన వారికి ఉచితంగా ల్యాప్‌టాప్‌లు, వినికిడి లోపం ఉన్నవారికి ఆండ్రాయిడ్ ఫోన్‌లను కూడా ఉచితంగా అందజేస్తోంది. అవయవ లోపం కలవారు ఆ లోపానికి సంబంధించిన సర్టిఫికెట్‌తో పాటు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకుంటే, అధికారులు పరిశీలించి అర్హత ఉన్నవారికి అవసరమైన ఉపకరణాలను అందజేస్తారు.

అర్హులందరికీ మంజూరుచేస్తాం



రాష్ట్రంలో అర్హులైన 1,750 మందికి ఉచితంగా మోటారు సైకిళ్లు అందజేశాం. తొలుత ప్రతి నియోజకవర్గంలో పది మందికి వాహనాలు ఇస్తున్నాం. ఇంకా అర్హులు ఉంటే సంబంధిత సర్టిఫికెట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించి ఉచితంగా మోటారు సైకిళ్లు అందజేస్తాం.

– పఠాన్ ముంతాజ్, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్

ప్రభుత్వ మేలు మరువలేను



నాకు ప్రభుత్వం ఉచితంగా మోటారు సైకిల్‌ను అందజేసింది. ప్రస్తుతం నేను చదువుకుంటూనే ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటున్నాను. ప్రభుత్వం అందజేసిన వాహనం నాకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రభుత్వం చేసిన మేలును ఎన్నటికీ మరువలేను.

– పులి దివ్య, గోల్లమూడి, నందిగామ మండలం

వ్యాపారానికి అండగా ఉంది



నేను పదో తరగతి వరకు చదువుకుని, చిన్న కిరాణా షాప్ ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నాను. గతంలో సరకులు తెచ్చుకోవాలంటే ఇబ్బందిగా ఉండేది. ప్రభుత్వం ఉచితంగా మోటారు సైకిల్ ఇచ్చింది. దానిపై వెళ్లి స్వయంగా సరుకులు తెచ్చుకోగలుగుతున్నాను.

– శీలం కిరణ్‌రెడ్డి, జయంతి, వీరులపాడు మండలం

నేత్రపర్వంగా గరుడ సేవ



హోమాలను నిర్వహిస్తున్న అర్చకులు



స్వామి వారి గరుడ సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో పలు ప్రత్యేక హోమాలను బుధవారం నేత్రపర్వంగా నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు కొనసాగాయి. అందులో భాగంగా ఉదయం విష్వక్సేన పూజతో కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆగమ పండితులు ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. పుణ్యాహవాచనం, పవిత్ర శయాధివాసం, సుత్రాభిమర్శన, అగ్ని ప్రతిష్టాపన, ఆకల్మష హోమాదులు, పారమాత్మిక, సర్వదైవత్య హోమాలు నిర్వహించారు. అలాగే తొలుత ఉత్సవమూర్తులను యాగశాలకు మంగళవాయిద్యాలతో మంత్రోచ్ఛరణలతో పండితులు తీసుకొచ్చారు. అనంతరం సంకీర్తనా గానాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. గురువారం స్వామి వారికి విశేష కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఏకాదశ విష్ణుసహస్రనామపారాయణం జరుగుతుందని తెలిపారు. ఉదయం స్వామి వారికి స్నపనాభిషేకాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అర్చకస్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి కార్యక్రమాలను నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకొని వెంకన్న స్వామికి గరుడ సేవ ఉత్సవాన్ని బుధవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. శ్రావణ మాస పౌర్ణమిని పురస్కరించుకొని గరుడ సేవ జరిగింది. ప్రతి నెలా పౌర్ణమి రోజున స్వామి వారికి గరుడ వాహన సేవను నిర్వహించటం ఆనవాయితీ. అందులో భాగంగా గరుడవాహనంపై వెంకటేశ్వరస్వామి వారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. ఆలయ ప్రాంగణంలో మూడు మార్లు ఊరేగించారు. అర్చకుల మంత్రోచ్ఛరణలు, భక్తుల నామస్మరణలు, కళాకారుల కోలాట విన్యాసాలు, మేళతాళాల మధ్య స్వామి వారి గరుడసేవ ఉత్సవం నేత్రపర్వంగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. పొన్నంగిపల్లి రామచంద్రమూర్తి, దీక్షిత్ కార్యక్రమాలు చేశారు.

దివ్యాంగ క్రీడాకారుడికి అభినందనలు



మితిన్‌ను అభినందిస్తున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: పుట్టుకతో మూగ అయినప్పటికీ క్రికెట్‌లో సత్తాచాటి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన వత్సవాయి గ్రామానికి చెందిన కాకర్ల మూడి మితిన్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అభినందించారు. మితిన్ ఆంధ్రప్రదేశ్ డెఫ్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22వ తేదీన ఒడిశా రాష్ట్రంలో జరిగే టీ–20 నేషనల్ క్రికెట్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో మితిన్‌ను ఉదయభాను అభినందించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదెల రామారావు, సర్పంచ్ భూక్యా రాజా, నాయకులు మిట్టపోలు నరేష్, షేక్ బాజీ, వరికల్లు శివయ్య, మందడపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం



నందిగామ బ్రాంచ్ కెనాల్ వద్ద జంగిల్ క్లియరెన్స్ పనులను ప్రారంభిస్తున్న ఉదయభాను

వత్సవాయి: రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా ఎన్ఎస్‌పీ కాలువల్లో పూడికతీత పనులు చేపట్టామని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను తెలిపారు. నందిగామ బ్రాంచ్ కెనాల్‌పై జంగిల్ క్లియరెన్స్, పెనుగంచిప్రోలు మేజర్, చిట్టేల మైనర్ కాలువల్లో పూడికతీత పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ.. నాలుగు కిలో మీటర్ల మేర రూ.5.50 లక్షలతో జంగిల్ క్లియరెన్స్ పనులను చేస్తున్నట్లు చెప్పారు. సాగర్ కాలువకు నీరు వచ్చే సమయానికి కాలువలను శుభ్రంగా ఉంచుతామన్నారు. ఈఈ సంతోష్, డీఈ రాంబాబు, మాజీ డీసీ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, కేడీసీసీ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణి, సర్పంచ్ గుడేటి శారమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు చింతకుంట్ల వెంకటరెడ్డి, గాదెల రామారావు, కనగాల రమేష్, గంగిపోగు రమేష్, సొసైటీ అధ్యక్షుడు కొండబోలు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితాలే లక్ష్యం

నందిగామ ఆర్డీఓ రవీంద్రరావు



తొలగించిన ఓట్లకు సంబంధించి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రరావు

నందిగామ: తప్పులు లేని ఓటరు జాబితాలను తయారు చేయడమే లక్ష్యమని ఆర్డీఓ ఎ.రవీంద్రరావు తెలిపారు. తొలగించిన ఓట్లకు సంబంధించి క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. నందిగామ, చందర్లపాడు మండలాల్లోని కేతవీరునిపాడు, చందాపురం, ముప్పాళ్ల గ్రామాల్లో ఆర్డీఓ రవీంద్రరావు బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లోని 50, 68, 70 పోలింగ్ స్టేషన్ల పరిధిలో తొలగించిన, బదిలీ చేసిన ఓట్లకు సంబంధించి పరిశీలన చేశారు. సిబ్బందితోపాటు స్థానికులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో ఎవరైనా సిబ్బంది అవకతవకలకు పాల్పడాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ



పూజ చేస్తున్న టీజే పూర్ణమ్మ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, జ్ఞాన సముపార్జన కోసం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టీజే పూర్ణమ్మ తెలిపారు. సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో నిర్మాణం చేపట్టిన అదనపు ఫ్లోర్‌లో సదుపాయలకు బుధవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జమలపూర్ణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదిలో పాఠ్య పుస్తకాలను చదవటం వలన అందులోని సారాంశం మాత్రమే తెలుస్తుందని చెప్పారు. కాంపిటేటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసమరైన అన్ని పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్‌ను గ్రంథాలయాల్లో అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. చక్కటి వాతావరణంలో చదువుకోటానికి కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగానే చిత్తరంజన్ గ్రంథాలయంలో అదనపు ఫ్లోర్ నిర్మాణం చేపట్టడంతో పాటు రూ. 9 లక్షలు మంజూరు చేసి పాఠకులకు అవసరమైన సదుపాయాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్, రికార్డ్ అసిస్టెంట్ ప్రణిత పాల్గొన్నారు.

రోడ్లపై యథేచ్ఛగా పశువుల సంచారం

- పశుసంచారంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనచోదకులు
- నిరుపయోగంగా మారిన బందెల దొడ్డి



నడి రోడ్డుపై తిష్టవేసిన పశువులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని రోడ్లపై పశువులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఫలితంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. హఠాత్తుగా పశువులు అడ్డుగా రావడంతో వాహనచోదకులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. రైతు బజారు, ఆర్టీసీ బస్టాండ్, మునిసిపల్ కూడలి, ముక్త్యాల బస్టాండ్, బలుసుపాడు సెంటర్‌లో ఆవులు నడి రోడ్డుపై గంటల తరబడి బైఠాయిస్తున్నాయి. రైతుబజారు వద్ద పాడైపోయిన కూరగాయలు, ఆకుకూరలను వ్యాపారుల బయట పడవేయటంతో వాటని తినటానికి పశువులు ఆ ప్రాంతంలో ఎక్కువగా సంచరిస్తున్నాయి. తోపుడు బండ్లతో ఇరుకుగా మారిన రైతుబజారు రోడ్డులో పశువుల సంచారంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

ఫలించని అధికారుల చర్యలు

ట్రాఫిక్‌కు సమస్యగా మారిన పశువులను నియంత్రించేందుకు మునిసిపల్, పోలీసు శాఖల అధికారులు గతంలో అనేక ప్రయత్నాలు చేశారు. నిర్మాణాత్మక కార్యాచరణ లేక ఫలితాలు తాత్కాలికంగానే మారాయి. కనిపించిన పశువులు అన్నింటిని బంధించి మార్కెట్ యార్డుకు ఒకసారి, వాసవీ గ్రంథాలయం సమీపంలో ఉన్న పప్పు మిల్లు దొడ్డిలో మరోసారి ఉంచారు. ఇంకొకసారి పెనుగంచిప్రోలులోని గోశాలకు తరలించారు. అయినప్పటికీ పశువుల యజమానులు నిర్లక్ష్యంగా ఆవులను రోడ్లపైకి తోలుతున్నారు. దీంతో వాటిని నియంత్రించడం, సంరక్షించటం పోలీసులకు తలనొప్పిగా మారింది. రోడ్లపైకి ఆవులు, ఇతర పశువులను వదిలే వారిపై కేసులు నమోదు చేస్తామని మునిసిపల్ కమిషనర్, సీఐ హెచ్చరించినా యజమానుల వైఖరుల్లో మార్పు కనిపించటం లేదు. కొన్ని రోజులు వదిలిపెట్టకుండా ఉంచినా, తరువాత ఎప్పటిలాగే వ్యవహరిస్తున్నారు. దీంతో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోంది.

పురాతన బందెలదొడ్డిని ఉపయోగించుకోవాలి



నిరుపయోగంగా ఉన్న బందెలదొడ్డి

పట్టణంలో ఏడు దశాబ్దాల క్రితం శ్రీరేణుకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న స్థలంలో నిర్మించిన బందెలదొడ్డి నేటికీ అలాగే ఉంది. జగ్గయ్యపేట గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో అప్పటి సర్పంచ్ సామినేని విశ్వనాథం ఈ బందెలదొడ్డిని పశువుల కోసం నిర్మించారు. నాలుగేళ్ల క్రితం తన్నీరు నాగేశ్వరరావు మునిసిపల్ చైర్మన్ ఉన్నప్పుడు బందెల దొడ్డిని పునర్నిర్మాణం చేసి వాడుకలోకి తీసుకొచ్చారు. అనంతరం కొంత కాలం సజావుగా సాగినా విజయవంతం కాలేదు. మునిసిపల్ అధికారులు ఈ బందెల దొడ్డిని అభివృద్ధి చేసి, రోడ్లపై సంచరించే పశువులను బంధించి, ఇక్కడ రక్షణ కల్పించాలని ప్రజలు సూచిస్తున్నారు. పశువుల యజమానుల నుంచి జరిమానాలు వసూలు చేస్తే పశువుల సంరక్షణకు ఆదాయం సమకూరుతుందని పేర్కొంటున్నారు.

నిబంధనలు పాటించాలి



గతంలో బందెల దొడ్డిని బాగు చేయించి వాడుకలోకి తీసుకువచ్చాం. బందెల దొడ్డిలో బంధించిన పశువులను విడిపించుకొని వెళ్లడానికి పశువుల యజమానులు అక్రమ మార్గాలను అన్వేషిస్తున్నారు. దీంతో బందెలదొడ్డి ద్వారా ఆదాయం రాకపోగా, రోడ్లపై పశువుల సంచారం యథాస్థితికి చేరుకుంది. అందరూ సహకరించి నిబంధనలు పాటిస్తే విజయవంతం చేయవచ్చు.

– రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ చైర్మన్, జగ్గయ్యపేట

పశువులు రోడ్లపైకి వదిలితే చర్యలు



పశువుల యజమానులు వాటిని రోడ్లపైకి వదలకుండా చర్యలు తీసుకుంటాం. త్వరలో మునిసిపల్ అధికారులు, పశువుల యజమానులతో సమావేశాలు నిర్వహించి కార్యాచరణ చేపడతాం. పశువులను రోడ్లపైకి వదిలివేసే వారిని గుర్తించి బందెల దొడ్డిలో బంధించడం, జరిమానాలు విధించడం ద్వారా రోడ్లపై పశువుల సంచారం నివారించొచ్చు.

– ఆర్. శ్రీనివాసరావు, ఎస్ఐ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పష్టమైన తుది ఓటర్ల జాబితా ప్రచురణకు రాజకీయ పక్షాలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక సంక్షిప్త సవరణ 2024లో భాగంగా రాజకీయపార్టీల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఢిల్లీరావు మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన విజయవంతమైందని చెప్పారు. పరిశీలనలో భాగంగా సేకరించిన సమాచారాన్ని వెబ్ సైట్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ జరుగుతోందని తెలిపారు. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామని పేర్కొన్నారు. జాబితా ప్రచురణ ప్రక్రియ అన్ని స్థాయిల్లోని రాజకీయపార్టీలకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో కె. మోహన్ కుమార్, కలెక్టరేట్ ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.